# ప్రజా

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 170 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 20 - 12 - 2025




రంగారెడ్డి జిల్లాలో 17 ఏళ్ల బాలికతో పెళ్లి ,కేసులో బాలిక భర్త, తండ్రికి జీవిత ఖైదు

## ప్రజావాణి సమస్యల పరిష్కారం కోసం
# ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- బేగంపేట ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవం
- ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయమన్న మల్లు భట్టి విక్రమార్క
- ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శ
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు



రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజావాణి ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. - మిగతా 2 లో

## తెలంగాణ డీజీపీ ఎదుట
## లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు



- డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన 41 మంది మావోలు
- కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రగుల్ల రవి లొంగుబాటు
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యుల లొంగుబాటు
- మావోయిస్టుల వద్ద 24 తుపాకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆపరేషన్ కగార్, కీలక నేతల మృతితో బలహీనపడిన పార్టీ

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అందులో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రగుల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు ఉన్నారు. - మిగతా 2 లో

## 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు



2 లో

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- 66 శాతం ప్రజలు కాంగ్రెస్‌తోనే ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారన్న కేటీఆర్
- అదే నిజమైతే 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని సవాల్
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదన్న కేటీఆర్
- ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందన్న కేటీఆర్

## హిందూ యువకుడిని కొట్టి చంపి, దహనం

- బంగ్లాదేశ్‌లో అల్లరిమూక దారుణం చేసిన అల్లరిమూక
- బంగ్లాదేశ్ వ్యాప్తంగా కొనసాగుతున్న హింసాత్మక ఘటనలు
- దైవదూషణ ఆరోపణలతో హిందూ యువకుడి హత్య
- మమతా బెనర్జీపై బీజేపీ తీవ్ర వ్యాఖ్యలు



బంగ్లాదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. దైవదూషణకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో దీపు చంద్ర దాస్ అనే హిందూ యువకుడిని అల్లరిమూక అత్యంత కిరాతకంగా కొట్టి చంపింది. అనంతరం అతని మృతదేహాన్ని ఓ చెట్టుకు కట్టేసి నిప్పంటించింది. మైమెన్‌సింగ్ జిల్లాలోని భలుకా ప్రాంతంలో జరిగిన ఈ అమానుష ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే... భలుకా ప్రాంతంలో నివాసముంటున్న దీపు చంద్ర దాస్ - మిగతా 2 లో

## క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

- అక్రమ బెట్టింగ్ యాప్ కేసులో పలువురు ప్రముఖుల ఆస్తులు జప్తు
- మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ
- నటుడు సోనూ సూద్, మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి ఆస్తులు కూడా సీజ్
- రూ.1000 కోట్లకు పైగా విలువైన 1xbet మనీ లాండరింగ్ కేసులో చర్యలు



2 లో

## మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా
# ఎదగాలని భారత్ కృషి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని భారత్ కృషి చేస్తోందన్నారు
- నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం
- రామోజీ ఫిల్మ్‌సిటీకి రాష్ట్రపతి
- పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ నేషనల్ కానారేన్స్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ప్రెసిడెంట్
- నియామకాల విషయంలో సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయన్నారు
- 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైందన్నారు రాష్ట్రపతి
- ఉద్యోగ భర్తీ విధానాల ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశంలోనే అత్యంత నమ్మకమైన సంస్థలుగా నిలుస్తున్నాయన్నారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఛైర్‌పర్సన్ల సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. నియామకాల విషయంలో సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయన్నారు. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైందని చెప్పారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విషయంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని వివరించారు. లక్ష్యాలు సాధించే దిశగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఉండాలని సూచించారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఛైర్‌పర్సన్ల నేషనల్ కానారేన్స్ జరుగుతోంది. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా మాట్లాడారు. భారత వృద్ధిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పారదర్శక ఉద్యోగ భర్తీ విధానాల ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశంలోనే అత్యంత నమ్మకమైన సంస్థలుగా నిలుస్తున్నాయని కొనియాడారు. అభ్యర్థుల నిజాయతీ, సమగ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జెండర్ సెన్సిటివిటీకి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అత్యధిక - మిగతా 2 లో





## 9 మంది ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ వన్ టు వన్ సమావేశాలు



2 లో

- జనసేన ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ సమీక్ష సమావేశాలు
- నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యలపై ప్రధానంగా చర్చ
- 9 మంది శాసనసభ్యులతో ముఖాముఖి భేటీలు
- మండలి బుద్ధ ప్రసాద్‌తో మొదలైన సమావేశాల పరంపర

## ఆ రెండు నగరాల్లో మెట్రో
# రైలు సేవలు అత్యంత ఆవశ్యకం


- కేంద్రమంత్రి ఖట్టర్ కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ఖట్టర్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపై కీలక చర్చ
- మెట్రో ప్రాజెక్టులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి
- కేంద్రానికి సవరించిన డీపీఆర్‌లు పంపినట్టు వెల్లడి
- రాష్ట్రంలో పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా, శుక్రవారం కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## వాయు కాలుష్యం ఎన్నాళ్లు?



మనం పీల్చే ప్రాణవాయువు కొంచెం కొంచెంగా మన ప్రాణాన్ని తోడేస్తున్నదంటే నమ్మబుద్ధి కాదు. ఈ సంగతి కొన్ని దశాబ్దాలుగా తెలుస్తూనే ఉన్నా ప్రతి ఏటా దేశ రాజధాని పౌరులు చలికాలం ఉన్నన్నాళ్లూ శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల ఏటికేడాదీ అది తప్పడం లేదు. కాకపోతే శీతకాలంలో మాత్రమే మన వ్యవస్థలన్నీ మేల్కొంటాయి. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలూ, ప్రభుత్వాల నియమ నిబంధనలూ, విపక్షాల విమర్శలూ, సామాన్యుల అరణ్య రోదనలూ... అన్నీ అప్పుడే! బీసీసీఐ సైతం దేశంలో దక్షిణాది రాష్ట్రాలు ఉన్నాయన్న సంగతే మరిచి ఇదే సీజన్‌లో ఢిల్లీలో, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో క్రికెట్ సంబరాల నిర్వహణకు సన్నాహాలు చేస్తుంది. ఈసారి కూడా రివాజు తప్పకుండా ఇవన్నీ ఒకదాని వెంబడి మరోటి సాగుతున్నాయి. పొగమంచు కమ్మేస్తున్న పర్యవసానంగా ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 50 శాతం మంది ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' మొదలైంది. ఉద్యోగులు సొంత వాహనాల్లో కాక, 'కార్ పూలింగ్' ద్వారా వచ్చేలా ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాజధాని వెలుపల రిజిస్టరై, బీఎస్–4 ప్రమాణాలు లేని వాహనాల రాకపోకల్ని నిషేధించారు. కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ లేని వాహనాలకు ఇంధనం విక్రయించరాదంటూ పెట్రోల్ బంకులకు ఆదేశాలు పోయాయి. 16 రోజుల పాటు అమల్లో ఉండేలా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్(గ్రాప్)–3 విధించారు. ఈ సమయమంతా నిర్మాణ పనులు నిలిచిపోవాలి. బీఎస్–3 పెట్రోల్, బీఎస్–4 డీజిల్ వాహనాలను అనుమతించబోరు. ఇవి 12 లక్షల వరకూ ఉంటాయని లెక్కేస్తున్నారు. మొత్తంగా ఉండే కోటిన్నర వాహనాల్లో ఇవి ఏపాటి? నమోదు చేసుకున్న నిర్మాణ కార్మికులు ఆంక్షల కారణంగా పనులు కోల్పోతే రూ. 10,000 చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అలా నమోదైన వారు కేవలం 2.57 లక్షలమంది మాత్రమే. ఇంతకు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నారని అంచనా. ఇవన్నీ మెచ్చదగ్గ చర్యలే. కానీ అసలు ఢిల్లీ సవ్యంగా ఉన్నదెప్పుడు? ఇటీవలికాలంలో అది నిరంతరం కాలుష్యంలోనే మునిగి తేలుతోంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధాంశాలన్నట్టు ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. కేంద్రీకృత నగర వ్యవస్థల వల్లనే ఈ అవస్థలన్నీ దాపురిస్తున్నాయని తెలిసినా వాటిని మానుకోవడం లేదు. ఢిల్లీలో వాయునాణ్యత అతి తీవ్ర స్థాయిలో... అంటే సగటు వాయునాణ్యతా సూచిక (ఏక్యూఐ) 400కు మించి ఉన్నదని తేలింది. ఇది వరుసగా మూడు రోజులుండగా, ఆ తర్వాత అది 'దయనీయ స్థితి'(వెరీ పూర్)కి... అంటే ఏక్యూఐ 300–400 పరిధిలో కొచ్చింది. కాలుష్యం గురించి దీపావళి పండుగకు ముందో, పంజాబ్‌లో పంట కోతల సమయంలోనో గుర్తుకురావటం వల్లే ఈ సమస్యంతా! కొన్నాళ్లపాటు మొత్తంగా టపాసులు కాల్చటానికి వీల్లేదని నిషేధం విధిస్తే 'మా పండుగకే ఇలాంటివి గుర్తొస్తాయా?' అనే తర్కం తలెత్తదు. బ్యాంకుల ద్వారా వాయిదాల్లో వాహనాల కొనుగోలును కొన్నాళ్లు ఆపేస్తే ఇంత చేటు కాలుష్యం ఉండదు. అసలు ప్రజా రవాణా వ్యవస్థను పటిష్ఠం చేస్తే అత్యధికులు వాహనాల జోలికిపోరు. పరిశ్రమలు వెదజల్లుతున్న ఉద్గారాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటే కాలుష్య భూతం అదుపులో ఉంటుంది. ఇవన్నీ పట్టన ట్టు నవంబర్– జనవరి మధ్య క్రికెట్ మ్యాచ్‌లకు బీసీసీఐ ఉత్తరాదిని ఎంచుకుని నగుబాటు పాలవుతోంది. లక్నోలో వాయునాణ్యత 400 మించటంతో శుక్ర వారం జరగాల్సిన మ్యాచ్‌ను రద్దుచేశారు. ఇప్పుడే కాదు... 2017లో ఢిల్లీలో భారత– శ్రీలంక మ్యాచ్ సమయంలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. ఆటగాళ్లకు శ్వాసకోశ సమస్య లొచ్చాయి. కొందరైతే ఆడుతూ వాంతులు చేసుకున్నారు. 2019లో భారత–బంగ్లా మ్యాచ్ సమయంలోనూ ఇంతే! రెండేళ్ల క్రితం బంగ్లా–శ్రీలంక వరల్డ్ కప్ మ్యాచ్ చివరి నిమిషంలో రద్దయింది. కనీసం ఈ సమయంలోనైనా దక్షిణాదిని ఎంచుకుందా మని బీసీసీఐకి తోచదు. ఇలా ఎవరికి తోచినట్టు వారు ప్రవర్తించకుండా ప్రభుత్వ విభాగా లన్నీ సమన్వయంతో పనిచేస్తే, ఏడాది పొడవునా అమలయ్యే చర్యలుంటే ఢిల్లీ కాస్త యినా మెరుగుపడుతుంది. కాలుష్య భూతాన్ని నియంత్రణలో ఉంచడం సాధ్యమవుతుంది.

## ఎవరికి ఎప్పుడు ముహూర్తం పెట్టాలో నాకు తెలుసు

**మొదటిపేజీ తరువాయి –** బలంగా నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీలో 'అలక' అనే ఒక జబ్బు ఉందని, దానిని వీడాలని కార్యకర్తలకు సూచించారు. "ఎమ్మెల్యేపై అలగడం కంటే, ఆయనతో పోరాడాలి. నాలుగు గోడల మధ్య తప్పులను సరిదిద్దాలి" అని హితవు పలికారు. మంగళగిరి, రాజమండ్రి నియోజకవర్గాలు టీడీపీకి కంచుకోటలని, ఇక్కడ పార్టీని ఓడించడం ఎవరి తరమూ కాదని ఆయన స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదిరెడ్డి వాసు, ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావును అన్యాయంగా జైల్లో పెట్టి వేధించారని లోకేశ్ ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని, నా తల్లిని కూడా అవమానించారు, ఆ విషయాలన్నీ నేను గుర్తుంచుకున్నాను అని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించినప్పుడు రాజమండ్రి కార్యకర్తలు తమ కుటుంబానికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి 164 స్థానాల్లో చారిత్రక విజయం సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమం అనంతరం పార్టీ కోసం కష్టపడిన కీలక కార్యకర్తలను లోకేశ్ సత్కరించి, వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

## 9 మంది ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ వన్ టు వన్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి –** డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తమ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. శుక్రవారం నుంచి ఆయన పార్టీ శాసనసభ్యులతో వన్ టూ వన్ (ముఖాముఖి) భేటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశాల పరంపర మండలి బుద్ధప్రసాద్‌తో మొదలైంది. ఈ సమీక్షల్లో భాగంగా, ప్రతి నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకోనున్నారు. అదేవిధంగా, నియోజకవర్గాల్లో ఇంకా పరిష్కారం కాని సమస్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ఎమ్మెల్యేలతో చర్చిస్తారు. మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు. మండలి బుద్ధ ప్రసాద్ అనంతరం దేవ వరప్రసాద్, లోకం నాగ మాధవి, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, సీహెచ్ వంశీకృష్ణ, నిమ్మక జయకృష్ణ, పంచకర్ల రమేశ్ బాబు, సుందరపు విజయ్ కుమార్ లతో ఆయన ముఖాముఖి భేటీ అవుతారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాం

**మొదటిపేజీ తరువాయి –** ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లలో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడించారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆక్షేపించారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఎన్ని విమర్శలు చేసినా తాము మరింత ముందుకు వెళతామని ఆయన అన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణిని విజయవంతం చేసిన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని భారత్ కృషి

**మొదటిపేజీ తరువాయి –** ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని భారత్ కృషి చేస్తోందని, అలాగే వికసిత భారత్–2047 సాధన కోసం కృషి చేస్తోందన్నారు. ప్రస్తుత సమయంలో భారత్‌కు అత్యుత్తమ పబ్లిక్ సర్వెంట్లు అవసరం ఉందని చెప్పారు. అలాంటి వారిని నియమించటంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఈ సదస్సు ద్వారా మరింత మెరుగైన విధానాలను అందిపుచ్చుకుం టాయని భావిస్తున్నానని అన్నారు. యూపీఎస్సీ ఛైర్మన్ కీలక సూచనలు : రాజ్యాంగం, పరిపాలన విభాగంలో ఈ సదస్సు కీలక పాత్ర పోషిస్తుందని యూపీఎస్సీ ఛైర్మన్ డా. అజయ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లను మరింత బలోపేతం చేయటం ప్రధాన లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లపై నమ్మకాన్ని పెంపొందించటం మనందరి బాధ్యత అని సూచించారు. యూపీఎస్సీ ద్వారా ఒక సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలనుకు ంటున్నట్లు వెల్లడించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సామర్థ్యం పెంపు, నమ్మకాన్ని



పెంపొందించాలని సూచించారు. లీగల్‌గా సమస్యలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేపట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. టీజీపీఎస్సీ పరీక్షలను సక్రమంగా నిర్వహించింది : 26వ నేషనల్ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించటం గర్వంగా ఉందని తెలంగాణ గవర్నర్ జిషుదేవ్ వర్మ తెలిపారు. గతేడాది అన్ని రకాల పరీక్షలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దిగ్విజయంగా నిర్వహించిందని కొనియాడారు. సేవా ద ృక్పథం కలవారిని ప్రతిభ ఆధారంగా, క్యాలెండర్ అనుగుణంగా నియామకాలు చేపట్టాలని సూచించారు. సమయానికి నోటిఫికేషన్లు ఇవ్వటం, పరీక్షల నిర్వహణ, ఫలితాలు ఇవ్వటం ద్వారా పీఎస్సీల పట్ల ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్ కుమార్ హాజరయ్యారు. ముందుగా రాష్ట్రపతి ముర్ముకు యూపీఎస్సీ ఛైర్మన్ సిల్వర్ ఫిలిగ్రీని అందజేశారు. ఈ సిల్వర్ ఫిలిగ్రీని హైదరాబాద్‌కు చెందిన కళాకారులు రూపొందించారు. అనంతరం పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న వివిధ రకాల సవాళ్లపై చర్చించారు. వివిధ రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలు, పరస్పర సహకారంపై చర్చ సాగింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన దృష్ట్యా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. నో ఫ్లై, నో డ్రోన్ జోన్‌గా రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రకటించారు.

# హిందూ యువకుడిని కొట్టి చంపి, దహనం

**మొదటిపేజీ తరువాయి –** స్థానికంగా ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మహమ్మద్ ప్రవక్తపై అతడు అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలు వ్యాపించాయి. దీంతో ఎలాంటి విచారణ చేపట్టకుండానే, వందలాది మందితో కూడిన మూక అతడిని చుట్టుముట్టి కర్రలతో దాడి చేసి హతమార్చింది. ఆ తర్వాత మృతదేహానికి నిప్పు పెట్టినట్లు సమాచారం. మృతుడిని దీపు చంద్ర దాస్‌గా భలుకా పోలీసులు ధృవీకరించారు. ఈ ఘటనపై బీజేపీ పశ్చిమ బెంగాల్ శాఖ తీవ్రంగా స్పందించింది. దీపు చంద్ర దాస్‌ను కొట్టి, ఉరితీసి, సజీవదహనం చేశారని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసతో ఈ ఘటనను పోల్చింది. బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులు దీపు చంద్ర దాస్‌ను కిరాతకంగా చంపేశారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అదుపు చేయనప్పుడు, మైనారిటీలకు రక్షణ కరవైనప్పుడు ఎలాంటి దారుణాలు జరుగుతాయో ఈ ఘటనే నిదర్శనం" అని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా మమతా బెనర్జీ తన రాజకీయ ప్రయోజనాల కోసం హిందువులను రెండో శ్రేణి పౌరులుగా మార్చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో దేశవ్యాప్తంగా అశాంతి నెలకొంది. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతి తర్వాత పలు ప్రాంతాల్లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ క్రమంలోనే మైనారిటీల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చిట్టగాంగ్‌లోని భారత డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వద్ద కూడా నిరసనకారులు భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

**మొదటిపేజీ తరువాయి –** అక్రమ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా భారత మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్పతో పాటు ప్రముఖ నటుడు సోనూ సూద్, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో నటి నేహా శర్మ, మోడల్ ఊర్వశీ రౌతేలా తల్లి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రాల ఆస్తులు కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జప్తు చేసిన ఆస్తుల్లో యువరాజ్ సింగ్‌కు చెందిన రూ. 2.5 కోట్లు, సోనూ సూద్‌కు చెందిన రూ. 1 కోటి, మిమీ చక్రవర్తికి చెందిన రూ. 59 లక్షలు, నేహా శర్మకు చెందిన రూ. 1.26 కోట్లు, రాబిన్ ఊతప్పకు చెందిన రూ. 8.26 లక్షలు, ఊర్వశీ రౌతేలా తల్లికి చెందిన రూ. 2.02 కోట్ల ఆస్తులు ఉన్నాయి. విదేశాల్లో రిజిస్టర్ అయిన '1×bet అనే అక్రమ బెట్టింగ్ యాప్ ద్వారా రూ. 1000 కోట్లకు పైగా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో గతంలోనే ఈ సెలబ్రిటీలందరినీ ఈడీ విచారించింది. వారి ఆస్తులను 'అక్రమ సంపాదన'గా (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్) పరిగణించి తాజా చర్యలు తీసుకుంది. ఇదే కేసులో గతంలో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాలకు చెందిన రూ. 11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే.




# తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు

**మొదటిపేజీ తరువాయి –** మావోయిస్టుల నుంచి పోలీసులు 24 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. వివిధ దళాల్లో పనిచేస్తున్న మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్? రెడ్డి వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణకు చెందిన వారు కామారెడ్డి జిల్లా వాసి ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్, మంచిర్యాలకు చెందిన కనికారపు ప్రభంజన్ కాగా మిగతా వాళ్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని తెలిపారు. కుమురం భీమ్ డివిజన్ కమిటీ కార్యదర్శి, ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. మావోయిస్టులు లొంగిపోవడానికి ప్రధాన కారణం 2026 మార్చి 31 వరకు కొత్త ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్టు పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయని డీజీపీ తెలిపారు. తెలియని ప్రాంతాలకు వెళ్లడం, నిత్యావసర వస్తువులు సరైన సమయంలో అందకపోవడం, కీలక నాయకులే లొంగిపోతున్న నేపథ్యంలో కిందిస్థాయి మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు వచ్చారన్నారు. "తెలంగాణ పోలీసుల సమక్షంలో 41 మంది సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన అజ్ఞాత కేడర్లు 24 ఆయుధాలతో లొంగిపోయారు. తీసుకొచ్చిన ఆయుధాల్లో ఒకటి ఎల్?ఎంజీ, 3 ఏకే 47 రైఫిల్స్, 5 ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, 7 ఇన్‌సాస్ రైఫిల్స్, 1 బీజేఎల్ గ్రానైడ్ లాంఛర్, నాలుగు 303 రైఫిల్స్, ఒకటి సింగిల్ షాట్ రైఫిల్స్, 2 ఎయిర్ గన్స్‌తో కలుపుకుని మొత్తం 24



ఆయుధాలతో లొంగిపోయారు. అక్టోబర్ 21, 2025 నాడు జరిగిన పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారు ఇచ్చినటువంటి పిలుపు మేరకు వీళ్ల ప్రభుత్వం ముందు లొంగిపోయారు". కేంద్రం కూడా సాయం చేస్తుంది : ప్రభుత్వం లొంగిపోయిన వారికి క్యాడర్ ప్రకారం నగదు పరిహారం అందిస్తుందని, ఆయుధాలతో లొంగిపోయే వారికి కేంద్ర ప్రభుత్వం కూడా సహాయం చేస్తుందని డీజీపీ తెలిపారు. లొంగిపోయిన 41 మంది మావోయిస్టులపై రూ. 1.46 కోట్లు కోట్ల రివార్డు ఉందన్న ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వారికి రావాల్సిన పరిహారాన్ని అందిస్తామన్నారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 25వేలను అందించినట్లు తెలిపారు. ఏ రాష్ట్రాలకు చెందిన వారిని ఆ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగిస్తామని అన్నారు. ప్రస్తుతం మావోయిస్టుల్లో మొత్తం 54 మంది మాత్రమే తెలంగాణ వాళ్లు ఉన్నారని, వీరిలో ఆరుగురు మాత్రమే తెలంగాణలో పనిచేస్తున్నారని శివధర్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలు దాదాపు అన్ని పోలీసుల నుంచి కొల్లగొట్టినవేనన్నారు, ఆర్మీ, పోలీసులు వద్ద ఉండే ఆయుధాలే వారి వద్ద ఉన్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులకు ఆయుధాల సీరియల్ నెంబర్‌లపై సమాచారం ఇస్తామన్నారు. వారికి గతంలో మిస్సైన ఆయుధాలను అప్పగించనున్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియా బోండీ బీచ్‌లో కాల్పులపై డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించారు. కాల్పులు జరిపిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడేనని తెలిపారు. 1998లో ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చాడని, అయితే ఈ ఉగ్రదాడికి హైదరాబాద్‌కు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. 1998లో సాజిద్ ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లినట్లు తెలిపారు. అక్కడే యురోపియన్ యువతిని పెళ్లి చేసుకున్నాడని, పెళ్లి అనంతరం మొదటి సారి 1998లో భార్యతో పాటు హైదరాబాద్ వచ్చాడని తెలిపారు. 2004లో ఓసారి, 2009 ఫిబ్రవరిలో మరోసారి వచ్చాడన్నారు. 2011 జూన్‌లో ఆస్తుల సెటిల్‌మెంట్ కోసం మరోసారి వచ్చాడని, 2016 మరో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం వచ్చాడని ఆయన చెప్పారు. 2022లో తల్లి, సోదరిని చూడటం కోసం వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

# 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు

**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో 66 శాతం ప్రజలు కాంగ్రెస్‌తోనే ఉన్నారని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను ఆయన తప్పుబట్టారు. నిజంగా అంత మద్దతు ఉంటే, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అప్పుడు తెలంగాణ ప్రజానీకం ఎవరి వైపు ఉందో తెలుస్తుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కనీసం 10 సీట్లు కూడా గెలవలేదని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో విజయం సాధించిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి కాబట్టి, ఎన్నికల నాటి విభేదాలను పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్‌పై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గెలుపును చూసి కాంగ్రెస్ ఆందోళన చెందుతోందని ఆయన అన్నారు. ఓటమి పాలైన అభ్యర్థులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని చెబుతున్నారని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని ఎద్దేవా చేశారు. స్వార్థపూరిత పదవుల కోసం వారు పాకులాడుతున్నారని ఆరోపించారు. గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్ వెంటే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సర్పంచ్ అయినా, ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని సూచించారు. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని,



వాటిని ఆపే అధికారం ముఖ్యమంత్రితో సహా ఎవరికీ లేదని తేల్చి చెప్పారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వచ్చినప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే పోరాడదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనవరిలో ఎన్నికలు వస్తే ఆ దిశగా ముందుకు సాగుదామని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, కొత్త గ్రామ, మండల, జిల్లా కమిటీలను వేసుకుందామని తెలిపారు. యువతకు, సీనియర్లకు సమానంగా అవకాశాలు కల్పిద్దామని ఆయన పేర్కొన్నారు.

# ఆ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అత్యంత ఆవశ్యకం

**మొదటిపేజీ తరువాయి –** రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడలలో మెట్రో రైలు ప్రాజెక్టులను వెంటనే ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ రెండు నగరాల్లో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలు అత్యంత ఆవశ్యకమని చంద్రబాబు మంత్రికి వివరించారు. మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ డీపీఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.



# హైదరాబాద్ నడిబొడ్డున కొత్త అభయారణ్యం!

**సుప్రీం తాజా తీర్పుతో మార్గం సుగమం**

**రాజధాని నగరం నడిబొడ్డున అభయారణ్యం**

**సాహెబ్‌నగర్-గుర్రంగూడ భూములు అటవీశాఖవేనంటూ సుప్రీం తీర్పు**

**ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పరమైన 102 ఎకరాల భూమి**



రాష్ట్ర రాజధాని నగరం నడిబొడ్డున కొత్త అభయారణ్యం రానుంది. సాగర్‌హైవే సమీపంలోని సాహెబ్‌నగర్-గుర్రంగూడ మధ్యలో ఉన్న 102 ఎకరాల అటవీ భూములకు సంబంధించి దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించడం, 102 ఎకరాలు అటవీ శాఖవేనంటూ గురువారం తీర్పు వెలువరించడంతో అక్కడే ఉన్న అటవీ భూముల్లో ఇవి కలిసిపోనున్నాయి. ప్రస్తుతం వీటి విలువ రూ.5 వేల కోట్లపైనే ఉంటుందని అంచనా. రెండు వారాల్లో వాటిని అభయారణ్యంగా (రక్షిత అటవీ ప్రాంతం)గా ప్రకటించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులు ఒకటి, రెండు రోజుల్లో భూములకు రక్షణ కంచెను నిర్మించనున్నారు.ఇదీ నేపథ్యం : రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో గుర్రంగూడ ప్రాంతంలో అటవీశాఖకు వందల ఎకరాల భూములున్నాయి. నాగార్జున సాగర్ హైవేకు సమీపంలో రోడ్డుకు ఎడమవైపు 102 ఎకరాలు తమవేనంటూ 20 ఏళ్ల క్రితం కొంతమంది జిల్లా కోర్టులో, అనంతరం మరో 200 మంది హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ అనంతరం 2021లో ఆ భూములు ప్రైవేటు వ్యక్తులవేనంటూ హైకోర్టు తీర్పును ప్రకటించింది. దీంతో అటవీశాఖ రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఆఖరి వాయిదా - ఫలించిన ఆలోచన : సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్?ఎల్పీ) దాఖలు చేసిన అటవీశాఖ అధికారులు, విచారణ కొనసాగుతున్న క్రమంలోనే ఆ భూమికి సంబంధించిన రికార్డులను న్యాయస్థానానికి సమర్పించారు. బలమైన సాక్ష్యాధారాలు సంపాదించాలని అధికారులు న్యాయవాదులతో పలుమార్లు సమాలోచనలు చేశారు. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన డాక్యుమెంట్లను పరిశీలిద్దామని నిర్ణయించి, కోర్టు అనుమతితో వాటిని హైదరాబాద్‌లోని రాజ్యాభిలేఖ కార్యాలయంలో పరిశీలన నిమిత్తం సమర్పించారు. అక్కడ అవి నకిలీవిగా తేలింది. ఈ అంశాన్ని అధికారులు రుజువులతో సహా సుప్రీంకోర్టుకు సమర్పించారు.'ఈ భూమి సాలార్‌జంగ్-3 స్వార్జితమని క్లెయిమ్‌దారులు(పిటషన్? దారులు) నిరూపించలేకపోయారు. జాగిర్ వ్యవస్థ రద్దుతో ప్రభుత్వం వద్ద ఉండిపోయింది. ఈ భూమిని క్లెయిమ్ చేస్తూ దాఖలైన పిటిషన్లకు కాలం చెల్లిపోయినా, ఆలస్యాన్ని అనుమతించే అధికారం ఎఫ్ఎస్ఓకు లేకపోయినప్పటికీ ఉదారంగా ఆమోదించారు. సాలార్‌జంగ్ వారసులకు అనుకూలంగా ఎఫ్ఎస్ఓను జారీ చేసిన ఆదేశాలను సమర్థించడంలో జిల్లా కోర్టు, హైకోర్టులు తప్పుచేశాయి. 2014 అక్టోబరు 15న ఎఫ్ఎస్ఓ జారీ చేసిన ఉత్తర్వులను, వాటిని ఖరారు చేస్తూ జిల్లా కోర్టు,హైకోర్టు ఇచ్చిన తీర్పులను కొట్టేస్తున్నాం. ఈ భూమిని 8 వారాల్లోగా తెలంగాణ అటవీ చట్టంలోని (ఫారెస్ట్? యాక్ట్) సెక్షన్ 15 కింద రక్షిత అటవీ ప్రాంతంగా ప్రకటించి, అందుకు సంబంధించిన ఉత్తర్వులను రిజిస్ట్రీకి సమర్పించాలి" .ఆ ప్రాంతాన్ని రక్షిత అటవీ ప్రాంతంగా ప్రకటించాలి : ప్రస్తుతం అన్ని నగరాల్లోనూ పచ్చదనం తగ్గిపోతుండటం ఆందోళనకరమని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అందుకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లు మినహాయింపేమీ కాదని వ్యాఖ్యానించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే స్పందించి, ఈ భూమిని 8 వారాల్లోగా తెలంగాణ అటవీ చట్టంలోని సెక్షన్ 15 కింద రక్షిత అటవీ ప్రాంతంగా ప్రకటించి అందుకు సంబంధించిన ఉత్తర్వులను రిజిస్ట్రీకి సమర్పించాలి అని సుప్రీం నిర్దేశించింది.ఈ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, నకిలీ ఎంట్రీలు చేశారని ధర్మాసనం పేర్కొంది. విక్రయ దస్తావేజు, ఆ భూమిని జాగిర్ అధీనం నుంచి విడుదల చేసిన ఉత్తర్వులు, దానిపై నిజాం అతియత్ కోర్టు వెలువరించిన తీర్పునకు సంబంధించిన క్లెయిమ్‌దారులు దాఖలు చేసిన డాక్యుమెంట్లను పరిశీలించకుండానే ఆమోదించినట్లు కనిపిస్తోందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. తెలంగాణ అటవీ చట్టంలోని సెక్షన్ 10 కింద ఉన్న అధికారాలకు అతీతంగా ఎఫ్ఎస్ఓ వ్యవహరించారని ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

# పట్టపగలే బ్యాంకు దోపిడీకి యత్నం

**తుపాకులతో బెదిరించి దుండగులు హల్‌చల్!**

**సిబ్బంది అలారం బటన్ నొక్కడంతో భయంతో దుండగుల పరారీ**

**సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుండగులకోసం గాలింపు**



ఓ వైపు ఆన్‌లైన్ మోసాలు, మరోవైపు దుండగుల దోపిడీలతో సామాన్య ప్రజలు భయపడుతున్నారు. పట్టపగలే బ్యాంకుల్లో దోపిడీ చేసిన ఘటనలు ఎన్నో జరిగాయి. తాజాగా ఇలాంటి సంఘటనే అనకాపల్లిలో చోటు చేసుకుంది. సమయం చూస్తే మధ్యాహ్నం 2.30 గంటలు అయ్యింది. బ్యాంకు సిబ్బంది అప్పుడే లంచ్ చేసి వారి సీట్లలోకి వస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో నలుగురు దుండగులు కెనరా బ్యాంకులోకి ప్రవేశించారు. బ్యాంకులో దుండగులు దోపిడీకి ప్రయత్నించగా బ్యాంకు మేనేజర్ చాకచక్యంగా వ్యవహరించారు. దాంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. అసలేం జరిగిందంటే ఈ కథనంలో తెలుసుకుందాం.వివరాల్లోకి వెళ్తే : అనకాపల్లిలోని రింగ్‌రోడ్డులోని కెనరా బ్యాంకు వద్దకు పట్టపగలే దుండగులు దోపిడీకి వచ్చి హల్‌చల్ చేశారు. బ్యాంకు ఉద్యోగులు లంచ్ చేసి అప్పుడే వచ్చారు. బ్యాంకు వద్దకు గురువారం మధ్యాహ్నం 2.30 గంటలు అవుతుంది. మూడు వాహనాల్లో ఏడుగురు వ్యక్తులు వచ్చారు. వీరిలో నలుగురు బ్యాంకు లోపలికి ప్రవేశించారు. మరో ముగ్గురు బయట ఉన్నారు. 25 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వీరిలో ముగ్గురు కెనరా బ్యాంకు బయటే ఉన్నారు. మిగతా నలుగురు బ్యాంకులోకి ప్రవేశించారు.తుపాకులతో బెదిరించి : దుండగులు వారి వద్ద ఉన్న తుపాకులతో ఖాతాదారులను, క్యాషియర్‌ను బెదిరించారు. ఈ సమయంలో బ్యాంకులో 10 మంది వరకు కస్టమర్లు ఉన్నారు. ఇద్దరు దుండగులు ఖాతాదారులను బెదిరించారు. మరో వ్యక్తి క్యాషియర్ కాలర్ పట్టుకుని లాగాడు. అతనికి తుపాకీ చూపించి భయపెట్టాడు. ఇదే సమయంలోనే మహిళా మేనేజర్ క్యాబిన్‌లోకి మరో వ్యక్తి వెళ్లాడు. తనకు డబ్బులు ఇవ్వాలంటూ మహిళా మేనేజర్‌కి గన్ చూపించి బెదిరించాడు. మేనేజర్‌ను బెదిరించాడు. లోపల గదిలో ఉన్న సిబ్బంది అలారం బటన్ నొక్కారు. ఆ అలారం పెద్ద శబ్దం వచ్చింది. దీంతో పోలీసులు వస్తున్నారనే భయంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లాలో తీవ్ర కలకాలం సృష్టించింది. దుండగులు పట్టపగలే బ్యాంకులోకి ప్రవేశించి, దోపిడీకి యత్నించడంతో కస్టమర్లు, బ్యాంకు సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు.దీనిపై బ్యాంకు మేనేజర్ సౌజన్య పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదనపు ఎస్పీ (క్రైం) మోహనరావు, పట్టణ ఎస్సై భాస్కరరావు సంఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. దుండగులు ఎలాంటి మాస్కులు ధరించకుండానే బ్యాంకులోకి ప్రవేశించారు. సీసీటీవీ ఫుటేజీలో ముఖాలు స్పష్టంగా కనిపించాయి. ఈ ఫుటేజ్ ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 15 నిమిషాల పాటు బ్యాంకులో ఉన్న దుండగులు దోపిడీకి యత్నించారు. అనకాపల్లి పట్టణ పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. దుండగులు తెచ్చినవి డమ్మీ తుపాకులా, నిజమైనవా అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# నిధులొచ్చాయ్ - చరిత్రాత్మక రామగిరి ఖిల్లాకు ఇక మహర్దశే!

**రామగిరి ఖిల్లా అభివృద్ధి దిశగా అడుగులు**

**రూ.5 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం**

**రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాట్లు**



చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నెలవైన రామగిరి ఖిల్లా అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. శత్రు దుర్భేద్యమైన కోట, ఎంతోమంది రాజవంశీకులు స్థావరంగా ఏర్పాటు చేసుకొని పరిపాలన చేసిన ప్రాంతం, ఔషధ మొక్కలకు నిలయం, ప్రాచీన కళా నైపుణ్యానికి నిదర్శనంలా నిలిచే కట్టడాలు, సీతారామలక్ష్మణులు నడయాడిన నేల, ఇలా అనేక విశిష్టతలు ఉన్న ఈ ఖిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను కేటాయించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలని యోచిస్తోంది.చేపట్టే అభివృద్ధి పనులు : పెద్దపల్లి జిల్లాలోని రామగిరి ఖిల్లా అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను కేటాయించింది. ఎకో టూరిజం ద్వారా నిధులు మంజూరు చేసిన సర్కారు, ఇందులో అటవీ శాఖకు రూ.1.14 కోట్లు, టూరిజం డిపార్ట్?మెంట్?కు రూ.3.86 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఖిల్లాపైకి వెళ్లేందుకు వీలుగా మెట్ల నిర్మాణం, పసరుబావులు శుభ్రం చేయడం, రక్షణ కంచె ఏర్పాటు, స్వాగత తోరణం, వాహనాల పార్కింగ్, ఖిల్లాపై వాచ్ టవర్, హోటల్, వసతి, పిల్లలు ఆడుకునేలా ఆట వస్తువులు ఏర్పాటు చేయనున్నట్లుగా అధికారులు వెల్లడించారు.ఇటీవల రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ, అధికారులు రామగిరి ఖిల్లా ప్రాంతంలో పర్యటించారు. ఖిల్లాపై అభివృద్ధి చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఖిల్లాకు 2 కి.మీల మేర రోప్‌వేను నిర్మించాలని ప్రతిపాదనలున్నాయి. కోట కింది నుంచి రోప్‌వే ద్వారా పర్యాటకులను నేరుగా ఖిల్లాపైకి తరలించేందుకు అవకాశం ఉంది. ఇది సాకారమైతే మరింత మంది పర్యాటకులను ఆకర్షిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. తద్వారా తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ఊతంగా నిలిచే అవకాశం ఉంది. ప్రత్యేకతలు ఇవే : శత్రు దుర్భేద్యమైన కోటలు, కట్టడాలు, ఔషధాలకు నెలవైనటువంటి మొక్కలు, జలజల పారే సెలయేర్లు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు చూపరులను మంత్రము గ్ధులను చేస్తాయి. సీతారామలక్ష్మణులు నడయాడిన నేల, ఎందరో రాజవంశస్థులు కోటగా చేసుకొని పరిపాలన సాగించారు. ఇలాంటి ఎన్నో అద్భుతాలకు నెలవైన ప్రాంతమే రామగిరి ఖిల్లా అని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ఎన్నో అద్భుతాలకు నెలవైన ప్రాంతమే రామగిరి ఖిల్లా. తాజాగా దీని అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మరింత సొబగులు దిద్దుకోనుంది. చూడదగ్గ ప్రదేశాలు : ఎంతో చారిత్రక నేపథ్యం కలిగినటువంటి రామగిరి కోట ఎన్నో ప్రకృతి అందాలకు నిలయం. ఇక్కడ సీతారాముల పాదముద్రలు, సీతమ్మ కొలను, సింహాల కోట, కుంకుమ్మరాళ్లు, పిల్లల ఫిరంగులు, దర్వాజాలు, మల్లెవనం, బృందావనం లాంటి ఎన్నో కనువిందు చేసే ప్రదేశాలను చూడవచ్చు. రాతి గోడలపై చెక్కిన సీతారామచంద్రుల విగ్రహాలను తిలకించవచ్చు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి రామగిరి ఖిల్లా 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బేగంపేట నుంచి కోటను ఎక్కి సుమారు 5-7 కిలోమీటర్ల నడిచి సీతారామచంద్రులను దర్శించుకొని రత్నాపూర్ నుంచి దిగొచ్చు. ఏటా శ్రావణమాసంలో అత్యధికంగా పర్యాటకులు సందర్శిస్తారు.ఎలా చేరుకోవాలంటే : సందర్శకులు పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి(మెయిన్? రోడ్?) బేగంపేట క్రాస్‌రోడ్డు వద్ద దిగాలి. ఇక్కడి నుంచి బస్సు లేదా ఆటోలో 4 కిలోమీటర్లు ప్రయాణిస్తే బేగంపేట గ్రామశివారుకు చేరుకోవచ్చు. ఇక్కడ నుంచి కాలినడకన మూడు కిలోమీటర్లు వెళ్తే ఖిల్లాకు చేరుకోవచ్చు. నేరుగా దైవదర్శనం చేసుకోవాలంటే రత్నాపూర్ గ్రామం నుంచి సొంత వాహనాల్లో ఖిల్లా కింది వరకు చేరుకోవచ్చు. పూర్తిగా అటవీప్రాంతం కావడంతో బృందంగా సందర్శించడమే మంచిది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఘోరం


**చిన్నారులకు హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన వైనం**

**మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రిలో వెలుగు చూసిన నిర్లక్ష్యం**

**తలసేమియా బాధితులైన ఐదుగురు చిన్నారులకు హెచ్‌ఐవీ**

**రక్తమార్పిడిలో భద్రతా వైఫల్యమే కారణమని నిర్ధారణ**

**ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు.. మాజీ సివిల్ సర్జన్‌కు నోటీసులు**



మధ్యప్రదేశ్‌లో అత్యంత దారుణమైన ప్రజారోగ్య వైఫల్యం ఒకటి వెలుగులోకి వచ్చింది. సత్నాలోని ప్రభుత్వ వైద్యశాలలో తలసేమియాతో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులకు హెచ్‌ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.ప్రాణాలు నిలబెట్టుకోవడం కోసం తరచూ రక్తమార్పిడిపై ఆధారపడే ఈ చిన్నారులకు మూడు వేర్వేరు బ్లడ్ బ్యాంకుల నుంచి మొత్తం 189 యూనిట్ల రక్తాన్ని ఎక్కించారు. ఈ క్రమంలో వారు 150 మందికి పైగా దాతల నుంచి సేకరించిన రక్తాన్ని పొందాల్సి వచ్చింది. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని సరిగా పరీక్షించకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని జిల్లా స్థాయి విచారణలో తేలింది. ఈ ఘటనపై స్పందించిన ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ.. బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్‌తో పాటు ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను సస్పెండ్ చేసింది. సత్నా జిల్లా ఆసుపత్రి మాజీ సివిల్ సర్జన్ డాక్టర్ మనోజ్ శుక్లాకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ ఏడాది మార్చిలోనే ఈ చిన్నారులలో మొదటి హెచ్‌ఐవీ పాజిటివ్ కేసు నమోదైంది. ఏప్రిల్ నాటికి మరికొందరికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. అయినప్పటికీ దాదాపు తొమ్మిది నెలల పాటు ఆసుపత్రి యాజమాన్యం, జిల్లా అధికారులు ఈ విషయాన్ని బయటపెట్టకుండా గోప్యంగా ఉంచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాధితుల్లో ఒక చిన్నారి తండ్రి ఎన్డీటీవీతో మాట్లాడుతూ, "ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఏం జరుగుతుంది?" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై ప్రభుత్వం సమాచారాన్ని తొక్కిపెడుతోందని, ఇది నేరపూరిత నిర్లక్ష్యమని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. రక్త పరీక్షల విధానాలు విఫలమయ్యాయని, సుమారు 250 మంది దాతలలో 125 మందిని మాత్రమే గుర్తించగలిగారని కాంగ్రెస్ నేత డాక్టర్ విక్రాంత్ భూరియా విమర్శించారు. ఇప్పటికే తలసేమియాతో పోరాడుతున్న పేద కుటుంబాలకు చెందిన ఈ చిన్నారులు, ఇప్పుడు జీవితాంతం హెచ్‌ఐవీ చికిత్స తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం విచారణ కమిటీలను నియమించినప్పటికీ, బాధితులకు ఎటువంటి న్యాయం జరుగుతుందన్నది చూడాలి!

# మామా సరకు పంపించా

**ఓసారి వాట్సాప్ చెక్ చేసుకో!'**

**స్మగ్లర్ల కొత్త ఎత్తుగడలు**

**ధర ఎంతైనా కొనడానికి సిద్ధంగా ఉన్న మాదక ద్రవ్యాల వినియోగదారులు**

**డ్రగ్స్‌ను పలు ప్రాంతాలకు చేరవేస్తున్న డ్రగ్‌పింగ్‌లు**



హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం పెద్దఎత్తున డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరి నెలల మధ్య 80-90 శాతం డ్రగ్స్ అమ్మకాలు జరుగుతుంటాయి. డ్రగ్స్ రవాణాను ఓవైపు హెచ్‌న్యూ, టీజీ న్యాబ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటుండగా, మరోవైపు మత్తుకు బానిసైన వారు అది అందుబాటులో లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎంత ఎక్కువ ధరకైనా కొనడానికి వెనకాడటం లేదు. కొకైన్, ఎండీఎంఏ, హెరాయిన్ వంటి వాటి ధర ఎంతైనా కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలోనే స్మగ్లర్లు కొత్త దారి కనుక్కొన్నారు. పోలీసులు పాత ఏజెంట్లపై నిఘా పెడుతుండటంతో ఎలాంటి కేసులు లేని వారిని రంగంలోకి దింపుతున్నారు.డెడ్‌డ్రాప్ పద్ధతిలో : న్యూ ఇయర్ వేడుకలకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. ఇప్పుడే వీలైనంత మత్తు పదార్థాలను రవాణా చేయాలని స్మగ్లర్లు చూస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్స్, ఫామ్‌హౌస్‌లు, పబ్‌లు సరకును రవాణా చేసుకొనేందుకు రెడీ అవుతుండగా, అంతర్జాతీయ ముఠాలు డ్రగ్స్‌ను చేరవేయడానికి నూతన మార్గాలు వెతుకుతున్నాయి. హెచ్‌న్యూ పోలీసులు ఇటీవల 10 మంది నైజీరియన్లను అరెస్ట్ చేశారు. డెడ్ డ్రాప్ పద్ధతిలో ముఠాలు మాదక ద్రవ్యాలను హైదరాబాద్‌కు చేరవేస్తున్నారు.విదేశాల నుంచి ఆదేశాలు రాగానే : మాదక ద్రవ్యాలను అమెరికా, నైజీరియాల నుంచి డ్రగ్ కింగ్‌పిన్‌లు వివిధ ప్రాంతాలకు చేరవేస్తుంటారు. హైదరాబాద్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కావాలని సోషల్ మీడియాల్లో ఆర్డర్ వస్తే, బెంగళూరులోని నైజీరియన్ ఏజెంట్లకు సమాచారాన్ని ఇస్తారు. ఇక్కడున్న పెడ్లర్స్‌కు సరకు పంపిస్తారు. డ్రగ్స్‌ను చిన్న ప్యాకెట్లుగా మార్చి ఓ చోట పెట్టి ఫొటో తీస్తారు. విదేశాల్లోని స్మగర్లకు పంపితే, ఆ ఫొటోలను నగరంలోని కొనుగోలుదారుల వాట్సాప్‌కు పంపిస్తారు. ఈ విధంగా చేసే ఓ ఐటీ ఉద్యోగి ఆరు నెలల్లో రూ.5 లక్షలు సంపాదించినట్లు పోలీసులు తెలిపారు.మీ స్నేహితులో, మీ బంధువుల పిల్లలో, చుట్టు పక్కల వారో డ్రగ్స్‌కు అలవాటు పడినా, విక్రయాలు చేస్తున్నా, ఏం సందేహించకుండా తెలంగాణ ఈగల్ బృందానికి సమాచారాన్ని అందజేయండి. తెలంగాణ సహాయ్, షీల్డ్ పేరుతో ఈ వెబ్‌సైట్ ఉంటుంది. దీని ద్వారా డ్రగ్స్ వాడుతున్న లేక విక్రయాలు జరుపుతున్న వారి సమాచారాన్ని తెలియజేయవచ్చు. దాంతో మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు. అందుకు ఈ రెండు వెబ్‌సైట్లు ఎంతగానో ఉపయోగపడతాయి.

**సహాయ్.ఏఐ :**

తెలంగాణ ఈగల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత కుడి వైపున ఈగల్ ఏఐ పేరుతో ఉన్న లింక్‌పై క్లిక్ చేయాలి.అప్పుడు తెరపై సహాయ్.ఏఐ విభాగం ప్రత్యక్షం అవుతుంది.డ్రగ్స్ నియంత్రణ, అలవాటు మానుకోవడానికి పునరావాస కేంద్రాలు, ఈగల్ టోల్ ఫ్రీ నంబరు తదితర సమాచారం ఇది అందిస్తుంది. డ్రగ్స్‌ని నియంత్రించడానికి పోలీసులకు సమాచారాన్ని ఇవ్వడంపై వివిధ అంశాలపై గురించి సహాయ్.ఏఐ విషయాలు ఇస్తుంది.

**షీల్డ్.ఏఐ :**

షీల్డ్‌లో టేక్ రిస్క్ టెస్ట్ మీద క్లిక్ చేస్తే కొన్ని ప్రశ్నలు వస్తాయి.మీరిచ్చే సమాధానాలను చూసి తెరపై విశ్లేషణ ప్రత్యక్షం అవుతుంది. అనుమానాస్పదంగా ఉంటే పరిస్థితి విషమించినట్లు, లేకపోతే ప్రమాదం తక్కువగా ఉన్నట్టు గుర్తించాలి. అక్కడ ఎవరిని సంప్రదించాలో ఫోన్ నెంబరు తెరపై కనిపిస్తుంది.

# నెరవేరిన శపథం.. నాలుగేళ్ల తర్వాత హెయిర్ కట్ చేయించుకున్న బీజేపీ ఎమ్మెల్యే



మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్, దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత గురువారం హెయిర్ కట్ చేయించుకున్నారు. తన నియోజకవర్గంలోని ప్రజల నీటి కష్టాలు తీరే వరకు జుట్టు కత్తిరించుకోనని ఆయన చేసిన శపథం నెరవేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రామ్ కదమ్ ముంబైలోని ఘట్కోపర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన నియోజకవర్గంలోని చాలా ప్రాంతాలు కొండలు, గుట్టలతో నిండి ఉండటంతో మంచినీటి సరఫరా తీవ్ర సమస్యగా మారింది. ప్రజల ఇబ్బందులను చూసి చలించిన ఆయన, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు కటింగ్ చేయించుకోబోనని నాలుగేళ్ల క్రితం ప్రతిజ్ఞ చేశారు.కొండ ప్రాంతాల్లోని ప్రజల కోసం 2 కోట్ల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకులు నిర్మించాలని, వాటికి భందూప్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఆయన ప్రయత్నాలు ఫలించి, ప్రభుత్వం వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను తాజాగా ప్రారంభించింది.పనులు మొదలవడంతో ఆయన తన శపథాన్ని విరమించుకున్నారు. ఈ సందర్భంగా రామ్ కదమ్ మాట్లాడుతూ.. "ఐదేళ్ల క్రితమే ఈ సమస్య పరిష్కారం గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ఇప్పుడు 2 కోట్ల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకుల నిర్మాణం, భందూప్ నుంచి పైప్‌లైన్ పనులు మొదలవడం సంతోషంగా ఉంది" అని తెలిపారు.

# 171 దేశాల పౌరులకు భారత్ ఈ-వీసా సౌకర్యం

**దేశంలో పర్యాటక అభివృద్ధికి వేల కోట్లు.**

**స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ. 2,208 కోట్లు కేటాయింపు**

**పర్యాటక ప్రచారం కోసం 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ పోర్టల్**

**రాజ్యసభలో వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్**




భారత్‌లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 171 దేశాల పౌరులకు 9 ఉప కేటగిరీల కింద ఈ-వీసా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలోని 31 అంతర్జాతీయ విమానాశ్రయాలు, 6 ప్రధాన ఓడరేవుల ద్వారా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ గురువారం రాజ్యసభకు తెలిపారు.ఒక లిఖితపూర్వక సమాధానంలో ఆయన మాట్లాడుతూ.. పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "స్వదేశ్ దర్శన్ 2.0" పథకం కింద 53 ప్రాజెక్టుల కోసం రూ. 2,208.27 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, 'ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్' (%జదీణణ%) కార్యక్రమం కింద 36 ప్రాజెక్టులకు రూ. 648.11 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ నిధులను కేంద్రం విడుదల చేయగా, సంబంధిత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఏజెన్సీలు ప్రాజెక్టులను అమలు చేస్తాయని తెలిపారు.పర్యాటక ప్రచారం కోసం 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ పోర్టల్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నామని మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్ల కోసం అధిక నాణ్యత గల ఫోటోలు, వీడియోలు, బ్రోచర్లతో 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా కంటెంట్ హబ్'ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు సోషల్ మీడియా, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కూడా భారత పర్యాటకాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com